సాక్షి ప్రకాశం

గురువారం । 18 । మే । 2023



మాదకద్రవ్యాల కట్టడికి చర్యలు

మాదకద్రవ్యాల కట్టడికి చర్యలు తీసుకోవాలని స్పీ మలికాగర్గ్ ఆదేశించారు. దర్శి సబ్‌డివిజన్ పోలీసు అధికారులతో ఆమె సమీక్షించారు. - 8లో..

అమరావతిలో పేదలు ఉండటం నేరమా..



అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం నేరమా అని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
45.95 /30

వాతావరణం

ఆకాశం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వడగాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

డీఈవోను సత్కరించిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయ సంఘ నాయకులు



డీఈవోను సత్కరిస్తున్న 1998 డీఎస్‌సీ ఉపాధ్యాయుల సంఘం నాయకులు

ఒంగోలు: నూతనంగా ఎన్నికైన 1998 డీఎస్‌సీ ఉపాధ్యాయ సంఘం నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్‌ను ఆయన చాంబరులో కలుసుకుని సత్కరించారు. డీఈవోను సత్కరించిన వారిలో 1998 డీఎస్‌సీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు మోర్తాల బాలిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు పి.వీరయ్య, ప్రధాన కార్యదర్శి మండవ సుబ్బారావు, ఎస్.కృష్ణ, రంగారెడ్డి, కే.శివప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జీతాలు రెండు మూడు రోజుల్లో వచ్చేలా మండల విద్యాశాఖ అధికారులకు సమాచారం పంపిస్తానని భరోసా ఇచ్చారు.

జగనన్న విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హత కలిగిన ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ (కాపులతో కలిపి) పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సుల్లో ఏదైనా 21 కేటగిరీల వారీగా సబ్జక్టుల్లో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సాంఘిక సంక్షేమశాఖ నోడల్ అధికారి లక్ష్మానాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 ఉత్తమ యూనివర్శిటీ/కాలేజీలలో ప్రపంచ దేశాలలోని నూతన జాబితా క్యుఎస్ లేదా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ వారి ప్రపంచ ర్యాంకింగ్ 2023 ప్రకారం సుమారు 379 యూనివర్శిటీ/ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. కనుక అర్హత కలిగిన విద్యార్థినీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా దరఖాస్తు చేయగోరు విద్యార్థులు క్వాలిఫయింగ్ పరీక్షలో 60 శాతం మార్కులు కలిగి ఉండాలి. ఎంబీబీఎస్‌కు దరఖాస్తు చేయగోరు విద్యర్థులు నీట్ పరీక్షల్లో తప్పనిసరిగా క్వాలిఫై ఉండాలి. ఈ పథకానికి అర్హత కలిగి ఎంపికైన ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు లేదా రూ.125 లక్షలు ఏది తక్కువైతే అది, ఇతర కళాశాల విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు లేదా రూ.100 లక్షలు ఏది తక్కువైతే అది చెల్లిస్తారన్నారు. ఈ పథకానికి అర్హత కలిగిన విద్యార్థులు వారి వార్షికాదాయం రూ.8 లక్షలలోపు, విద్యార్థి వయస్సు నోటిఫికేషన్ నాటికి 35 సంవత్సరాలు లోపు ఉండాలన్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం నిర్దేశిత ప్రొఫార్మాలో మాత్రమే ఉండాలన్నారు. ఈ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా జూన్ 10వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎల్‌ఐసీ మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: ఈనెల 21, 22, 23వ తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఎల్‌ఐసీ ఏఓఐ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర నాయకుడు కె.బాలచంద్రం పిలుపునిచ్చారు. బుధవారం ఎల్‌ఐసీ ఒంగోలు బ్రాంచి వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. ప్రజల సంస్థ అయిన ఎల్‌ఐసీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. కొత్తగా ఉద్యోగులను నియమించకుండా, ఉద్యోగులకు, ఏజెంట్లకు ఉన్న సౌకర్యాలను తొలగించడం లాంటి కుయుక్తులకు పాల్పడతుందన్నారు. జీఎస్టీ పేరుతో పాలసీదారులపై మోయలేని భారం మోపుతుందని, ఎల్‌ఐసీని దెబ్బతీసేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. అత్యంత విశ్వసనీయమైన సేవలు అందిస్తున్న ఎల్‌ఐసీని ప్రైవేటు పరం చేయకుండా ఏజెంట్లు, ఉద్యోగులు, పాలసీదారులు, ప్రజలు కలిసి పోరాటం చేయాలని కోరారు. అనంతరం మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు పారా శ్రీనివాసరావు, జి.కోటేశ్వరరావు ఏఐఓ మహాసభలకు సంఘీభావం ప్రకటించారు. ఎస్.వెంకటరావు, సీ.హెచ్.వీ.సుబ్బారెడ్డి, పాపని సుబ్బారావు, జి.శ్రీనివాసులు, చింపిరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ దడ



ప్రభుత్వశాఖల్లో అవినీతిపరుల భరతం పట్టేందుకు అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరుకు నిర్దిష్టమైన ఫిర్యాదులు వెళ్లడంతో పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు అవినీతిపరులకు దడపుట్టిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు స్థాయిల్లో సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి వివిధ శాఖల్లోని సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి అవినీతికి ఆస్కారం లేకుండా పౌరసేవలు అందిస్తోంది. దీంతో కొంత మేర అవినీతికి అడ్డుకట్ట పడింది. అయితే ఇంకా స్వతంత్రంగా సేవలు అందిస్తున్న పలు శాఖల్లో అవినీతి జాడ్యం వదల్లేదు.

- అవినీతి అధికారుల గుండెల్లో గుబులు
- టోల్ ఫ్రీ నంబర్ 14400కు ఫిర్యాదుల వెల్లువ
- ప్రభుత్వ కార్యాలయాలపై నిఘా

మార్కాపురం: రాష్ట్రంలో అవినీతిని కూకటి వేళ్లతో సహా పెకలించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తేవడంతో ఉచితంగా అందించాల్సిన సేవలను లంచంతో ముడిపెట్టి ఇబ్బంది పెడుతున్న అధికారుల భరతం పడుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా రంగంలోకి దిగుతున్న ఏసీబీ అధికారులు దూకుడు పెంచి అవినీతిపరుల అంతు చూస్తున్నారు. వారి అక్రమాస్తులపై కూడా దృష్టి సారించారు. ఎవరిపై ఫిర్యాదులు వస్తున్నాయో వారికి సంబంధించి మూలాల్లోనూ శోధించి ఆస్తులను జప్తు చేయడంతో పాటు జైలు ఊచలు లెక్కింప చేస్తున్నారు. ఏసీబీకి పట్టుబడిన అవినీతిపరులు చివరికి నడిరోడ్డుపై నిలబడుతున్న పరిస్థితులు ఇప్పుడు అధికారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి.

టోల్ ఫ్రీ నంబర్ 14400 సత్ఫలితాలు

టోల్ ఫ్రీ నంబర్ 14400 ప్రజలకు అందుబాటులోకి రావడంతో నిర్భయంగా ఫోన్ చేసి అవినీతి అధికారులను ఏసీబీకి పట్టిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడాది వ్యవధిలో ఏసీబీ అధికారులు తన సొంత శాఖ అయిన పోలీస్‌శాఖలోని అవినీతి అధికారులను ఉపేక్షించడం లేదు. ఫిర్యాదుదారుడికి న్యాయం చేయాల్సిన ఒక స్టేషన్ ఎస్ఐ లంచం అడగడంతో ఏసీబీని ఆశ్రయించాడు. సదరు ఎస్ఐతో పాటు మధ్యవర్తిగా వ్యవహరించిన కానిస్టేబుల్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విద్యుత్, సబ్ రిజిస్ట్రార్, రెవెన్యూ అధికారులపై నిఘా పెట్టి సమయం కోసం ఎదురుచూస్తున్నారు. తన పొలాన్ని రిజిస్టర్ చేయాలని కోరగా లంచం అడిగిన సబ్ రిజిస్ట్రార్‌పై రైతు ఏసీబీకి చెప్పడంతో ఆ సబ్ రిజిస్ట్రార్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో పాటు ఆయన కూడబెట్టిన అక్రమాస్తులపై కూడా వెలికి తీశారు. విద్యుత్ కనెక్షన్ కోసం కార్యాలయానికి వెళ్తే డబ్బు లేనిదే కనెక్షన్ ఇవ్వనని తెగేసి చెప్పిన లైన్ మెన్‌ను ఓ రైతు ఏసీబీకి పట్టించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించడంతో లంచాలు తీసుకోవాలంటేనే అధికారులు భయపడుతున్నారు. టోల్ ఫ్రీ నంబరు అందుబాటులోకి రావడంతో తాము లంచం అడిగితే ఎక్కడ ఉద్యోగం పోగొట్టుకుని జైలు జీవితం గడపాల్సి వస్తుందోనన్న ఆందోళన ఉద్యోగుల్లో ఏర్పడింది.

ఇటీవల నమోదైన కొన్ని ఏసీబీ కేసులు

- గత వారం కంభం సబ్ రిజిస్ట్రార్ శ్రీరామమూర్తి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దర్శిలోని ఆయన నివాసంలో కూడా రెండు రోజుల క్రితం అధికారులు సోదాలు చేశారు.
- కొండపి ఎస్ఐ, కానిస్టేబుల్ కేసు నమోదు విషయంలో ఫిర్యాదుదారుడి దగ్గర నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.
- తర్లుపాడు ఏఎస్ఐ ఒకరు కేసు విషయంలో డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో ఆయన్ను కూడా పట్టుకున్నారు.
- పంగులూరులో విద్యుత్ కనెక్షన్ కోసం రైతును డబ్బులు డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులకు సమాచారం అందించడంతో పట్టుకున్నారు.



ఒంగోల్‌లోని ఏసిబి కార్యాలయం

సంవత్సరం	నమోదైన ఏసీబీ కేసులు
2020	16
2021	11
2022	9
2023 (ఇప్పటి వరకు)	3

ఈ కేసుల్లో ఆయా శాఖల అధికారులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి



ఉచితంగా ప్రభుత్వ సేవలు అందించాల్సిన అధికారులు, సిబ్బంది ఎవరైనా లంచాలు అడుగుతూ ఇబ్బంది పెట్టినా, అక్రమాస్తులు కలిగి ఉన్నాడన్న సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ నంబర్ 14400కు ఫిర్యాదు చేయొచ్చు. వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు. ఒంగోలులోని భాగ్యనగర్‌లో ఉన్న ఏసీబీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయొచ్చు. అయితే తప్పుడు ఫిర్యాదులు, బ్లాక్ మెయిల్ ఫిర్యాదులు వద్దు.

– వి.శ్రీనివాసరావు, డీఎస్పీ, ఏసీబీ, ఒంగోలు

రేపు ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీ

కొత్తపట్నం: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి సహకారంతో ఈ నెల 19న ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యుడు కట్టా చంద్రశేఖర్, తంబి సురేష్ తెలిపారు. చెరుకూరి ఉషారాణి ద్వితీయ వర్ధంతి సందర్భంగా కొత్తపట్నం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కొత్తపట్నం క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయం వెనుక భాగంలో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసి వైఎస్సార్ క్రీడా ప్రాంగణంగా నామకరణ చేసిన గ్రౌండ్‌ను కూడా ప్రారంభిస్తారు. చెరుకూరి ఉషారాణి జ్ఞాపకార్థం భర్త డాక్టర్ చెరుకూరి వీరరాఘవరావు సొంత నిధులతో క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తారు. మొదటి బహుమతి రూ.25,116, రెండో బహుమతి రూ.15,116, మూడో బహుమతి రూ.10,116, నాల్గో బహుమతి రూ.5,116 అందజేస్తారు. లీగ్ దశ నుంచి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కూడా ఉంటుంది. పూర్తి వివరాలకు కట్టా చంద్రశేఖర్ 8121761361, తంబి సురేష్ 9848343301 సంప్రదించాల్సిందిగా కోరారు.

గిద్దలూరు సీఐగా దేవ ప్రభాకర్



సీఐ దేవప్రభాకర్

ఒంగోలు టౌన్: గిద్దలూరు సీఐగా పి.దేవ ప్రభాకర్‌ను బదిలీ చేస్తూ గుంటూరు రేంజి ఐజీ పాల్ రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం దేవ ప్రభాకర్ ఒంగోలు డీసీఆర్‌బీలో సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే గిద్దలూరు సీఐ ఎండీ ఫిరోజ్‌ను నెల్లూరు జిల్లా కలికిరికి బదిలీ చేశారు. రేంజి వీఆర్‌లో ఉన్న కాకుమాను వెంకటరావును డీసీఆర్‌బీ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని పేర్కొన్నారు.



ఎండ మంట..

- అత్యధికంగా జిల్లాలో 45.95 డిగ్రీల ఉష్ణోగ్రత
- పలు మండలాల్లో 44 డిగ్రీల పైగానే..
- అల్లాడుతున్న జనం
- మరో మూడు రోజులు ఇంతే..

ఒంగోలు అర్బన్: ఎండవేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఐదు రోజులుగా జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడికి ఉక్కపోత కూడా తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో జిల్లావాసులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. బుధవారం జిల్లాలో అత్యధికంగా పెద్దారవీడులో 45.95 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా కేంద్రం ఒంగోలులో 44 డిగ్రీలు నమోదు కాగా కురిచేడు 45.65, పొదిలి మండలం ఉప్పలపాడులో 45.39, కొనకనమిట్లలో 45.21, మర్రిపూడి మండలం జువ్విగుంటలో 45.9, దర్శి మండలం రాజంపల్లిలో 44.45, పామూరు మండలం బొట్లగూడురులో 44.41, పొన్నలూరు మండలం మాలెపాడులో 44.9, కంభం మండలం రావిపాడులో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత ఏడాది మే నెలలో అత్యధికంగా 43 డిగ్రీలు వచ్చింది. చివరి నాలుగు రోజులు మినహా ఆ నెలంతా మోస్తరు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వడదెబ్బకు బుధవారం జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. రానున్న 24 గంటల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర విపత్తుల శాఖ సామాజిమాధ్యమాల ద్వారా ప్రజలను హెచ్చరిస్తోంది.

	గరిష్ఠం	కనిష్ఠం
పెద్దారవీడు	45.95	30
కురిచేడు	45.65	30
ఉప్పలపాడు	45.39	30
కొనకనమిట్ల	45.21	30
జువ్విగుంట	45.09	30
రాజంపల్లి	44.45	30
బొట్లగూడూరు	44.41	30
పెద్దదోర్నాల	44.17	30
పొన్నలూరు	44.16	30
రావిపాడు	44.06	30
బేస్తవారిపేట	44	28
మార్కాపురం	43	28
ఒంగోలు	43	30

వడదెబ్బ నుంచి రక్షణకు వైద్య ఆరోగ్య శాఖ సూచనలు ఇవీ...

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేడి గాలులకు వడదెబ్బలు తగలకుండా, ఒక వేళ వడదెబ్బ తగిలినా దాని లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. ఎండ తీవ్రత సమయం (ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు) బయట తిరగవద్దని హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా తాగునీటిని తీసుకోవాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు కనీసం ఒకగ్లాసు మంచినీళ్లు తాగాలి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే చల్లని నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, చల్లని తాగునీరు వంటివి తీసుకోవాలి. ఎండలో నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు, తేనె వంటివి తీసుకోకూడదు.

వడదెబ్బ లక్షణాలు ఇవీ...

వడదెబ్బ తగిలితే తలనొప్పి, తల తిరగటం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ వంటి లక్షణాలు ఉంటాయి.



జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్, హాజరైన కమిటీ సభ్యులు, అధికారులు

ఎస్సీ, ఎస్టీలకు అండగా ప్రభుత్వం

- అట్రాసిటీ బాధితులకు న్యాయం చేయడంలో జాప్యం ఉండకూడదు
- విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు అర్బన్: ఎస్సీ, ఎస్టీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్నీ విధాలుగా అండగా ఉంటుందని, వీరి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రకాశం భవనంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ ఎస్ దినేష్‌కుమార్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. దీనిలో మంత్రితో పాటు ఎస్పీ మలికాగర్గ్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, అట్రాసిటీ చట్టం ప్రకారం నమోదైన కేసుల స్థితిగతులు, బాధితులకు పరిహారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ అట్రాసిటీ బాధితులకు న్యాయం చేయడంలో జాప్యం లేకుండా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఎఫ్ఐఆర్‌లను పూర్తి వివరాలతో సమగ్రంగా నమోదుచేయాలని సూచించారు. కేసుల నమోదు, బాధితులకు పరిహార పంపిణీ ప్రక్రియను కలెక్టర్, ఎస్పీలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో గత ఏడాది అక్టోబర్ 1 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 30 మధ్య నమోదైన 75 కేసుల్లో 224 మంది బాధితులకు రూ.1.70 కోట్ల పరిహారం చెల్లించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. అందుకోసమే నియోజకవర్గాల వారీగా ప్రత్యేక స్పందన కార్యక్రమాలు, ప్రతి మండలంలో పౌర హక్కుల దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సమస్యలపై చర్చించి చేసిన తీర్మానాలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్డీవోలను ఆదేశించారు.

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ బాధితులకు సత్వర పరిహారం అందేలా ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియలో అవలంబిస్తున్న విధానాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ బాలికల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఆర్ శ్రీలత, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ కొండయ్య, డీఈఓ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, హౌసింగ్ పీడీ పేరయ్య, డీపీవో నారాయణరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయరత్నం, కనిగిరి ఆర్డీవో అజయ్‌కుమార్, ఎస్‌డీసీ ఉమాదేవి, డీఎస్పీలు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొట్లూరి లక్ష్మయ్య, పెరిక జయరావు, బొమ్మతోటి రమణమ్మ, గూడూరి వినోద్‌కుమార్, తహశీల్దార్లు పాల్గొన్నారు. అనంతరం అట్రాసిటీ పరిహారం కింద దళిత మహిళకు ఉద్యోగ నియామక పత్రం అందజేశారు.

బోధనా నైపుణ్యాలను పెంచుకోవాలి



శిక్షణను పరిశీలిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకుడు ప్రభాకర్ తదితరులు

ఒంగోలు: బోధనా నైపుణ్యాలను ఉపాధ్యాయులు పెంపొందించుకోవాలని, అందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకే ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చి అండ్ ట్రైనింగ్) పరిశీలకులు ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కాలేజీలో ఈ మేరకు జరుగుతున్న ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న విద్యావిషయాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడం, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంచడం ద్వారా నాణ్యమైన బోధన అందించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. 1998, 2008, 2018 డీఎస్‌సీ బ్యాచ్ ఉపాధ్యాయులు మొత్తం 220 మంది తొలి బ్యాచ్ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. సులభతరమైన రీతిలో పిల్లలకు ఎలా బోధించాలి, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉండాలంటే ఎలాంటి అంశాలను పెంపొందించుకోవాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమ కోర్సు ఇన్‌చార్జిగా ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి టి.కిషోర్‌బాబు, నెల్లూరు అకడమిక్ మానిటరిగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి వెంకారెడ్డి తదితరులు శిక్షణను పర్యవేక్షించారు.

నేటి నుంచి పలకల కార్మికుల సమ్మె



ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

మార్కాపురం: డిజైన్ స్లేట్ కార్మికుల వేతనాలను యాజమాన్యం పెంచకపోవడంతో గురువారం నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ తెలిపారు. సమ్మెకు మద్దతుగా బుధవారం పట్టణంలో కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కూలీల పెంపుదల కోసం యాజమాన్యం, కార్మికుల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయన్నారు. వేతనాలు పెంచాలని యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామన్నారు. మొండి వైఖరి వీడి కార్మికుల కూలీలు పెంచాలని కోరారు. కార్మికులు కూలీ రేట్లు డ్యూటీకి రూ.350 పెంచాలని కోరుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డిజైన్ స్లేట్ కార్మికుల అసోసియేషన్‌తో జరిగిన చర్చల్లో ఫలితం లేదని కార్మికులు ఒక మెట్టు దిగి రూ.310 ఇస్తే చాలనీ ఒప్పుకున్నా యాజమాన్యాలు ముందుకు రావట్లేదన్నారు. రూబేన్, బాలశేషయ్య, రాములు, ప్రకాశం, ఆదిరెడ్డి, విక్టర్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

- అధికారులను హెచ్చరించిన కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: మండల స్థాయిలో అన్నీ శాఖల పనితీరు మెరుగుపడేలా ప్రత్యేక అధికారులు పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ప్రకాశం భవనంలో మండల, నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ 13 ప్రధాన శాఖలకు సంబంధించిన పనులు మెరుగుపరిచేలా చర్యలు తీసుకున్నామన్నారు. అందులో భాగంగా మండల స్థాయి ప్రత్యేక అధికారులు ప్రతి మంగళ, శుక్రవారాల్లో, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు నెలలో నాల్గవ శుక్రవారం నిర్దేశించిన శాఖలను తనిఖీ చేయాలని ఆదేశించారు. సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, ఇతర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పరిశీలించే క్రమంలో శాఖలకు సంబంధించి ప్రతి అంశాన్ని చెక్‌లిస్ట్ రూపంలో నివేదిక తయారు చేయాలన్నారు. మండల, నియోజకవర్గాల్లో నిర్వహించే సమావేశాలకు క్షేత్ర స్థాయి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని చెప్పారు. నిర్దేశించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్, ఆయిల్ అపహరణ

● రూ. 8 నుంచి రూ. 10 లక్షల విలువ ఉంటుందని అంచనా



ఫ్యాక్టరీలోని ట్రాన్స్ ఫార్మర్ వైర్లు తొలగించి ఉన్న దృశ్యం

మద్దిపాడు: ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ తొలగించి అందులోని కాపర్ వైరును ఆయిల్‌ను దొంగతనం చేసిన ఘటన ఆలస్యంగా గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో వెలుగు చూసింది. అందిన వివరాల ప్రకారం.. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని ప్లాట్ నెంబర్ 425లో ఉన్న కాస్పెక్స్ అల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గత కొంతకాలంగా మూసి వేసి ఉంది. ఈక్రమంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొందరు దుండగులు ఫ్యాక్టరీ ఆవరణలోకి ప్రవేశించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్‌కు ఏర్పాటు చేసిన డోరు వద్ద తాళాన్ని కట్టర్‌లో కత్తిరించి లోనికి ప్రవేశించి ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ తొలగించారు. 500 కేవీఏ కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ, ఆయిల్‌ను దొంగిలించుకు పోయారు. వాటి విలువ సుమారు రూ. 8 నుంచి రూ.10 లక్షల వరకూ ఉంటుందని ఫ్యాక్టరీ మేనేజర్ నరసారెడ్డి తెలిపారు. దీనిని యజమాని పి.కృష్ణ చైతన్యకు తెలుపగా బుధవారం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

మాదకద్రవ్యాల కట్టడికి చర్యలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్



సమావేశంలో పాల్గొన్న దర్శి పోలీసు అధికారులు

● గంజాయి పెండింగ్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయండి
● నేరగాళ్ల మూలాలు పసిగట్టాలి
● ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: మాదకద్రవ్యాల కట్టడికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో దర్శి సబ్ డివిజన్‌లోని డీఎస్పీలు, సీఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి పెండింగ్ కేసుల దర్యాప్తు వేగంగా పూర్తిచేసి నిందితులకు జైలుశిక్ష పడేలా కోర్టులో చార్జీషీటు దాఖలు చేయాలని ఆదేశించారు. సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసుస్టేషన్ల వారీగా నమోదైన గంజాయి, ఐటీ యాక్ట్ కేసుల నమోదు, నేరస్తుల అరెస్టులు, దర్యాప్తు తీరుతెన్నుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కేసుల తాలూకా ఫైళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి కేసుల్లో నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని, వారి మూలాలను వెలికితీయాలని చెప్పారు. పాత నేరస్తుల కార్యకలాపాలపై నిఘా వేయాలని, గంజాయి రవాణా చేసేవారిని, విక్రయించే వారిని, వినియోగించే వారిని గుర్తించాలన్నారు. ఎవ్వరినీ ఉపేక్షించవద్దన్నారు. సైబర్ నేరాల విషయంలో తక్షణమే స్పందించాలని, నేరం జరిగిన తీరుతెన్నులను విశ్లేషించాలని సూచించారు. ఆయా కేసుల్లో ప్రణాళికాబద్ధంగా దర్యాప్తు చేయాలని, వీలైనంత త్వరగా బాధితులకు న్యాయం చేసేందుకు ప్రయత్నించాలన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత ప్రైవసీకి భంగం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న సైబర్ నేరగాళ్ల భరతం పట్టాలన్నారు. ప్రతి ఒక్క అధికారి సైబర్ నేరాలను చేధించే సాంకేతిక పరిజ్ఞానం పట్ల అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎస్వీ శ్రీధర్ రావు, దర్శి డీఎస్పీ టి.అశోక్‌వర్ధన్, పొదిలి సీఐ రాఘవేంద్ర, దర్శి సీఐ రామకోటయ్య, కురిచేడు ఎస్సై అజయ్‌కుమార్, డీసీఆర్బీ ఎస్సై శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతపై పీడీ యాక్ట్

● కడప జైలుకు తరలింపు
● ఎవరినీ ఉపేక్షించేది లేదు
● ఎస్పీ మలికా గర్గ్ హెచ్చరిక

ఒంగోలు టౌన్: గంజాయి విక్రేతలపై ఎస్పీ మలిక గర్గ్ కొరడా ఝుళిపించారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న గంజాయి విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని చెబుతున్న ఎస్పీ మరోసారి చేతల్లో దాన్ని నిరూపించారు. పోలీసు కేసులను సైతం లెక్క చేయకుండా గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిపై పీడీ యాక్టు ప్రయోగించి బుధవారం జైలుకు పంపించారు. కొండపి మండలం అనకర్లపూడి గ్రామానికి చెందిన ముప్పరాజు వెంకన్న అనే 69 సంవత్సరాల వృద్ధుడు గంజాయి విక్రయిస్తున్నాడు. గత 3 ఏళ్లుగా టంగుటూరు, సింగరాయకొండ, కొండపి మండలాల్లో దందా చేస్తుండగా.. సెబ్ అధికారులు, పోలీసులు 4 సార్లు కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ తీరు మారలేదు. నేర ప్రవృత్తిని వీడకుండా అదే పనిని కొనసాగిస్తున్నాడు. ఎస్పీ మలిక గర్గ్ ఆదేశాల మేరకు పీడీ చట్టం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించగా.. కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

శిక్ష తప్పదు

యువత, నిరుపేద కూలీలు, శ్రామికులను లక్ష్యంగా చేసుకొని కొందరు వ్యక్తులు గంజాయిని విక్రయిస్తున్నారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఎస్పీ మలికా గర్గ్ హెచ్చరించారు. ప్రజారోగ్యానికి ప్రమాదకరమైన మాదక ద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో నిందితులుగా ఉండి పోలీసు శాఖ హెచ్చరికలను బేఖాతరు చేస్తే జైలు శిక్ష తప్పదన్నారు. పదేపదే మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్న సమాచారం తెలిస్తే వెంటనే సెబ్ టోల్ ఫ్రీ నెంబరు 14500, డయల్ 112కు తెలియజేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

అమరావతిలో పేదలు ఉండటం నేరమా..?

● వచ్చే ఎన్నికల్లో పేదలందరూ చంద్రబాబుకు గుణపాఠం చెబుతారు
● ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత



ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. బుధవారం రాత్రి ఆమె మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అమరావతిలో పేదలు ఉండడం నేరమా అని ప్రశ్నించారు. పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుకునేందుకు కోర్టుకెళ్లారన్నారు. అయితే సుప్రీం కోర్టు తీర్పు చంద్రబాబుకు చెంపపెట్టులా ఉందన్నారు. చంద్రబాబు నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనపై విష ప్రచారం చేస్తూనే ఉన్నారన్నారు. 2019లో చంద్రబాబు పెత్తందారీ రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేరుస్తుంటే దానిని కూడా అడ్డుకునేందుకు అమరావతి రైతుల ముసుగులో దొంగ దీక్షలు చేస్తున్న రియల్టర్లకు సుప్రీంకోర్టు తీర్పు మింగుడుపడడం లేదన్నారు. చంద్రబాబు ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఏనాడైనా పేదల కోసం ఆలోచించారా అని ప్రశ్నించారు. అవినీతిరహిత పారదర్శక పాలన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తుంటే పచ్చమీడియా బురద జల్లుతోందని విమర్శించారు. 2024లో చంద్రబాబుకు ప్రజలు సరైన బుద్ధి చెప్పి ఇంటికి పంపనున్నారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం లోకేష్‌కు కంపులా ఎందుకు అనిపిస్తుందో అర్థం కావడం లేదన్నారు. పేదలను కంపులా ఉచ్చరించడంలోనే లోకేష్ సంస్కృతి ఎలాంటిదో అర్థమవుతోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతూ వారి అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షసాధింపు చర్యలు ఇకనైనా మానుకోవాలన్నారు. గత ప్రభుత్వం పేదల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని, ఐదేళ్లు అధికారం ఇస్తే గ్రాఫిక్స్ చూపించారే గాని అభివృద్ధి కనుచూపు మేర లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తే 23 సీట్లకే ఎందుకు పరిమితం అయ్యారో వారే అర్థం చేసుకోవాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే ఓర్చుకోలేకనే విషప్రచారం చేస్తున్నారని, ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

వడదెబ్బకు ముగ్గురు మృతి



మాజీ సర్పంచ్ షేక్ కాలేషా పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న వరికూటి



బస్ షెల్టర్‌లో చనిపోయి ఉన్న వృద్ధుడు

కంభం: జిల్లాలో వడదెబ్బకు బుధవారం ముగ్గురు మృతి చెందారు. కంభం పట్టణంలో సింధూమార్టు సమీపంలో కొండేటి గురవయ్య(55) నడుచుకుంటూ వెళ్తూ ఒక్కసారిగా కిందపడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురవయ్యను వైద్యులు పరీక్షించిన వడదెబ్బతోనే మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు.

సింగరాయకొండ: వడగాల్పులకు బుధవారం మాజీ సర్పంచ్ షేక్ కాలేషా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వడదెబ్బ కారణంగా ఉదయం నుంచి అస్వస్థతగా ఉన్నాడు. ఉప సర్పంచ్ గా భాద్యతలు నిర్వహించిన కాలేషా కొద్ది రోజులు సర్పంచ్‌గా పదవీ భాద్యతలు నిర్వర్తించారు. ఇతని మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు. కాలేషా పార్థివదేహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, పార్టీ సీనియర్ నాయకులు తాటిపర్తి చంద్రశేఖర్, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, శీలం రాము, పార్టీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు.

వడదెబ్బకు వృద్ధుడు మృతి

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు సమీపంలోని లారీ యూనియన్ ఆఫీసు ఎదురుగా ఉన్న బస్ షెల్టర్‌లో వడ దెబ్బకు వృద్ధుడు మరణించిన ఘటన బుధవారం ఉదయం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం గత కొన్ని సంవత్సరాలుగా ఓ వృద్ధుడు మద్దిపాడులో తిరుగుతూ హోటళ్ల వద్ద తింటూ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం లారీ యూనియన్ ఆఫీస్ ఎదురుగా ఉన్న బస్ షెల్టర్‌లో బుధవారం ఉదయం చనిపోయి ఉండటంతో ఆదారి వెంట వెళుతున్న వారు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

యువకుడు ఆత్మహత్యా యత్నం



కొండల్లో నుంచి యువకుడిని తీసుకువస్తున్న ఎస్సై



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు

● కాపాడిన ఎస్సై రామకృష్ణ

దర్శి: కుటుంబ కలహాల నేపథ్యంలో మండలంలోని కొర్లమడుగులో అమలబోలు మల్లికార్జున్ అనే యువకుడు ఆత్మహత్యా యత్నం చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. కుటుంబంలో నెలకొన్న వివాదాల కారణంగా మనస్తాపం చెందిన మల్లికార్జున తన స్నేహితుడు అంకిరెడ్డికి ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అంకిరెడ్డి వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి వివరాలు వెల్లడించాడు. ఎస్సై రామకృష్ణ.. మల్లికార్జున్‌కు ఫోన్ ట్రేస్ చేసి కొండ ఒడ్డున ఓ చోట ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకుని మల్లికార్జున్‌ను పరిశీలించగా హానికర మందు తాగి ఉన్నట్లు గుర్తించి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు మల్లికార్జున్‌కు చికిత్స అందిస్తున్నారు.

ఈ ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి



హజ్ యాత్రికులు జానీ బాషా

● అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించేందుకు ముందుకు రావడంపై హర్షం
● హజ్ యాత్రికులు జానీ బాషా

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల పక్షపాతి అని మరో మారు నిరూపించిందని హజ్ యాత్రికుడు జానీ బాషా పేర్కొన్నారు. హజ్ యాత్రీకుల కోసం అమరావతిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన ఎంబార్కిమెంట్ సెంటర్‌లో ఒక్కో యాత్రీకునిపై రూ. 83,407 అదనపు భారం పడుతున్న విషయాన్ని మీడియా ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి కేంద్ర మంత్రులతో మాట్లాడారన్నారు. రాష్ట్రం నుంచి 1813 మంది మక్కా యాత్రకు ఈ ఏడాది వెళుతున్నారని, ప్రకాశం జిల్లా నుంచి 105 మంది వెళుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి అదనంగా పడుతున్న భారాన్ని భరించేందుకు ముందుకు వచ్చి రూ. 14.50 కోట్లు విడుదల చేసిందని, ఈ మొత్తం నుంచి మక్కా యాత్రకు వెళ్ళేవారి వ్యక్తిగత ఖాతాలో రూ. 80 వేలు చొప్పున జమ చేస్తుందన్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి ముస్లింల పవిత్ర యాత్రకు ఆటంకం తొలగించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

అదుపుతప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లిన కారు

● నెల్లూరు జీఎస్టీ డిప్యూటీ కమిషనర్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు మార్జిన్లోని ఐరన్ మెష్‌ను ఢీకొన్న కారు

సింగరాయకొండ: ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పిన కారు రోడ్డు మార్జిన్లోని ఐరన్ మెషన్‌ను ఢీకొంది. ఈ ఘటన బుధవారం జాతీయరహదారిపై పెరల్ డిస్టిలరీ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం పొట్టిశ్రీరాములు నెల్లూరు నుంచి ఒంగోలు వెళ్తున్న నెల్లూరు జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ప్రత్యూష కారు పెరల్ డిస్టిలరీ సమీపంలోకి రాగానే అదుపు తప్పి రోడ్డు మార్జిన్లోకి దూసుకుని వెళ్లి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా డిప్యూటీ కమిషనర్ ప్రత్యూషకు స్వల్పగాయాలయ్యాయి. కారు డ్రైవర్ వెంకట శేషయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహమ్మద్ ఫిరోజ్ ఫాతిమా వివరించారు.

విద్యుదాఘాతానికి ఒకరు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామిరెడ్డి

చీమకుర్తి: పొలానికి నీళ్లు పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని నిప్పట్లపాడు పొలాల్లో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన రైతు జంగ్రాజుపల్లి కోటయ్య(43) పొలానికి నీళ్లు పెడతామని స్విచ్ వేయగా షాక్ గురై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బంధువులు మెరుగైన వైద్యం కోసం కోటయ్యను ఆటోలో ఒంగోలుకు తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు మృతుని భార్య జంగ్రాజుపల్లి అరుణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై రామిరెడ్డి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి దుర్మరణం



ఘటనా స్థలంలో మృతిచెందిన నరసరాజు

నాగులుప్పలపాడు: ద్విచక్రవాహం నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఉప్పుగుండూరు-నాగులుప్పలపాడు మధ్య 216 జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే..అద్దంకి పట్టణానికి చెందిన నరసరాజు (55) బుధవారం ఉదయం బాపట్ల నుంచి అద్దంకికి మోటారు సైకిల్‌పై వస్తుండగా నాగులుప్పలపాడులోని వరాహగిరి కోల్డ్ స్టోరేజీ సమీపంలోకి వచ్చేసరికి మృతునికి కళ్లు తిరగడంతో పాటు ధీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బయటవేయడంతో రోడ్డు పక్కనే ఉన్న రైలింగ్‌కు బలంగా ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుని వివరాలు తీసుకున్న అనంతరం కుటుంబసభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

మనస్తాపం చెంది వ్యక్తి ఆత్మహత్యా యత్నం

● ఎస్సై అవమానించాడని..

మార్టూరు: పోలీస్ స్టేషన్‌లో ఎస్సై తనను అవమానించారంటూ ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈఘటన బుధవారం సాయంత్రం మండలంలోని రాజుపాలెం గ్రామంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రాజుపాలెం ఎస్టీ కాలనీకి చెందిన కుంటా రాంబాబు స్థానిక కొణిదెన రోడ్డులో గల ఓ హోటల్ సిబ్బందితో బుధవారం ఉదయం స్వల్ప వివాదం జరిగింది. హోటల్ యాజమాని సమాచారంతో ఎస్సై కానిస్టేబుల్‌ను హోటల్‌కు పంపి రాంబాబును ఉదయం 9 గంటల ప్రాంతంలో స్టేషన్‌కు పిలిపించాడు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో స్టేషన్ నుంచి ఇంటికి చేరిన రాంబాబు భార్య పిల్లలతో ఎస్సై తనను గంజాయి కేసు పెట్టి లోపల వేస్తే నీకు దిక్కెవరురా అంటూ తనను దూషించినట్లు కుటుంబ సభ్యులతో చెప్పుకొని బాధపడ్డాడు. ఎస్సై అన్నంత పని చేస్తాడని బోరున విలపించినట్లు కుటుంబ సభ్యుల సమాచారం. అనంతరం గ్రామంలోని మెడికల్ షాపుకు వెళ్లి రెండు అట్టల ఎవిల్ టాబ్లెట్‌లు కొనుగోలు చేసి ఇంటికి వచ్చిన రాంబాబు మింగి పడుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న రాంబాబును గమనించిన కుటుంబ సభ్యులు 108 సిబ్బంది సాయంతో మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.